క్లుప్తంగా

జోరుగా రథం తయారీ పనులు



పనులను పర్యవేక్షిస్తున్న దాత బాబు వరప్రసాద్

కూడేరు: స్వయంభూ జోడు లింగాల సంఘమేశ్వర స్వామి ఆలయ నూతన రథాన్ని ఏప్రిల్ 12వ తేదీన జరిగే రథోత్సవానికి సిద్ధం చేసేలా చర్యలు చేపడుతున్నట్లు నిర్వాహకులు, దాతలు తెలిపారు. సుమారు రూ.65 లక్షల అంచనాతో చేపట్టిన రథం తయారీ పనులను బుధవారం పర్యవేక్షించారు.

పోటాపోటీగా బహిరంగ వేలం

కూడేరు: పార్వతీ పరవమేశ్వరుల స్వయంభూ జోడు లింగాల సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద పూజా సామగ్రి విక్రయ దుకాణం, సప్లయర్స్ సామాన్ల అద్దె దుకాణం ఏర్పాటుకు బుధవారం నిర్వహించిన బహిరంగ వేలం పోటాపోటీగా సాగింది. అనంతపురానికి చెందిన లక్ష్మీనరసమ్మ రూ.2.90 లక్షలకు పూజా సామగ్రి దుకాణాన్ని దక్కించుకుంది. అలాగే కూడేరుకు చెందిన మల్లికార్జున రూ.1.85 లక్షలకు సప్లయర్స్ దుకాణాన్ని దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ పర్యవేక్షణాధికారి వన్నూరు స్వామి, ఈఓ రమేష్ బాబు, ఆలయ సేవా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

50 శాతం వడ్డీ మాఫీ

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 31లోగా ఆస్తి పన్ను (ఇంటి, ఖాళీ స్థలాల) బకాయిలు చెల్లించే వారికి 50 శాతం వడ్డీ రాయితీ కల్పిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. ఆస్తి పన్నుతోపాటు పాత బకాయిలపై వడ్డీ రాయితీని ప్రభుత్వం ప్రకటించిందని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పకడ్బందీగా నిర్వహించండి



నార్పు హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ వసంతబాబు

కళ్యాణదుర్గం: పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ వసంత బాబు అధికారులకు సూచించారు. పట్టణంలోని నార్పు హై స్కూల్ లో పది పరీక్షా కేంద్రాన్ని బుధవారం ఆర్డీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో వెలుతురు, తాగునీటి వసతిపై ఆరా తీశారు.

బడిని కాపాడుకుందాం

బొమ్మనహాళ్: ప్రభుత్వ బడిని రక్షించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు ప్రభుత్వం, సమాజం కూడా తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు తెలిపారు. బుధవారం దేవగిరి క్రాస్‌లోని ప్రాథమిక పాఠశాలలో యూటీఎఫ్ సమావేశం నిర్వహించారు. గోవిందరాజులు మాట్లాడుతూ పేద విద్యార్థులు ప్రభుత్వ విద్యకు దూరం కాకుండా ఉండేలా విద్యారంగంలో సంస్కరణలు ఉండాలన్నారు. అనంతరం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాఘవేంద్ర రావు, ఆంజినేయులు మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓలు మల్లికార్జున, వీరన్న, గౌరవ అధ్యక్షులు నాగభూషణం, అధ్యక్షులు రాఘవేంద్ర రావు, ప్రధాన కార్యదర్శి ఆంజినేయులు, మల్లికార్జున, వాణిశ్రీ, రామలింగాదేవి, సునీత, బ్రహ్మేశ్వరి, అశోక్, వీర ఓబులు, శ్రీనివాసులు, శ్రీనాథ్‌రావు, రవి వర్మ, మహేశ్వర, రాము నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందుతో పుణ్యఫలం

కణేకల్లు: పవిత్ర రంజాన్ మాసంలో ఇచ్చే ఇఫ్తార్ విందుతో పుణ్యఫలం లభిస్తుందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కణేకల్లులోని జామియా మసీదులో ముతవల్లి ముర్షిద్‌పీర్ ఖాద్రీ, ఎంసీ శర్మస్ ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదిక

గుమ్మఘట్ట: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ మహిళా మండల సమాఖ్య కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామకృష్ణ, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోండి



అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి

కణేకల్లు: విద్యార్థి దశ నుంచే వ్యక్తిగత పరిశుభ్రత అలవాటు చేసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ సూచించారు. సొల్లాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీ శివరామ్‌తోపాటు హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నీటి వృథా అరికట్టేది ఎవరు?

- తరచూ గేట్‌వాల్వ్‌ల రిపేరీ
- పలు చోట్ల పైపులైన్ల లీకేజీలు
- రోజూ 80 వేల లీటర్ల నీరు వృథా
- అరికట్టకపోతే వెతలు తప్పవు
- ఇదీ రాయదుర్గం మున్సిపాలిటీలో దుస్థితి



భంభంస్వామి ఆలయానికెళ్లే దారిలో గేట్‌వాల్వ్ పగిలి వృథా అవుతున్న తాగునీరు



చంద్రబాబు కాలనీలో పైప్‌లైన్ పగిలి పారుతున్న తాగునీరు

రాయదుర్గం: వేసవి వచ్చిందంటే చాలు తాగునీటి అవసరాలు పెరిగిపోతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వాడుకుంటేనే అందరికీ నీరందుతుంది. లేకుంటే నీటికొరత తీవ్రంగా వేధిస్తుంది. అయితే రాయదుర్గం మున్సిపాలిటీ పరిధిలో తాగునీరు పైపులైన్ల లీకేజీ కారణంగా వృథా అవుతున్నా అధికార యంత్రాంగం మొద్దునిద్రలో ఉంది. తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తోంది. పట్టణంలో 32 వార్డులు ఉన్నాయి. 75వేల దాకా జనాభా ఉంది. సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంక్ ద్వారానే పట్టణానికి నీరు సరఫరా అవుతోంది. ఎస్ఎస్ ట్యాంకు సామర్థ్యం 3,052 ఎంఎల్‌డీ కాగా.. ప్రస్తుతం 2,742 ఎంఎల్‌డీ నీరు నిల్వ ఉంది. రోజుకు 9–14 ఎంఎల్‌డీ నీరు డ్రాచేసుకున్నా 190 రోజులు అంటే మరో ఆరు నెలలకు సరిపడు తాగునీరు అందుబాటులో ఉంది. ఈ నీరు వృథా చేయకుండా కాపాడుకునే బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉంది. అయితే కూటమి అధికారంలోకి వచ్చాక నీటి పథకాల నిర్వహణ కాస్త అస్తవ్యస్తంగా మారింది. వైఎస్సార్ తాగునీటి పథకంతో పాటు పట్టణంలో 85 పవర్‌బోర్లు, 5 చేతిబోర్లు ఉన్నాయి. వీటితో 11,298 వ్యక్తిగత కుళాయిలు, 150 పబ్లిక్ ట్యాప్‌లకు నిత్యం నీరందుతోంది. పట్టణంలోని మారెమ్మ గుడి, హౌసింగ్ కార్యాలయం దారి, శాంతినగర్, కోతిగుట్ట, భంభంస్వామి దారి, చంద్రబాబు కాలనీ తోపా ఆయా వార్డుల్లోనూ పైప్‌లైన్ల లీకేజీలు కనిపిస్తున్నాయి. ప్రధాన పైప్‌లైన్ కూడా పలుచోట్ల డ్యామేజీ కావడంతో లీకేజీలు అధికమవుతున్నాయి. దీంతో నిత్యం 70–80 వేల లీటర్ల నీరు వృథా అవుతోందని అంచనా.



హౌసింగ్ కార్యాలయం సమీపాన తాగునీరు లీకేజీ



మారెమ్మగుడి దారిలో లీకేజీ నీరు

మూణ్నాళ్లకే దెబ్బతింటున్న వాల్వ్‌లు

తాగునీటి సరఫరాకు పైపులైన్ల మధ్య కంట్రోల్ వాల్వ్‌ల నాణ్యత మూణ్నాళ్ల ముచ్చటగా మారుతోంది. మరమ్మతులు చేసిన కొన్ని రోజులకే మళ్లీ లీకేజీ అవుతోంది. వాల్వ్‌లు తరచూ తిప్పడంతో ఈ రాడ్స్ అరిగిపోతున్నాయి. వాటికి జనపనారతో మరమ్మతులు చేస్తుండగా కొన్ని రోజులకే యథావిధిగా మా రుతోంది. పట్టణ వ్యాప్తంగా ఈ సమస్య ఉండగా.. సరఫరా చేసే సమయంలో 15 శాతం నీరు రోడ్లపై పారుతోంది.

శ్రీరామిరెడ్డి పథకానిదీ అదేదారి?

పట్టణం మీదుగా ఉడేగోళం చేరే శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం పైపులైను పలుచోట్ల దెబ్బతిని లీకేజీ కనిపిస్తోంది. హైర్ గేట్‌వాల్వ్‌లు పగిలి ఫౌంటేన్‌లా నీరు రోడ్లపైకి చిమ్ముతుంటాయి. భంభంస్వామి ఆలయానికెళ్లి దారిలో గత ఆరు నెలల నుండి ఈ సమస్య ఉన్నా పట్టించుకునే నాథులే లేరు.

మరమ్మతులకు చర్యలు

నీటి లీకేజీలు అరికట్టి సమృద్ధిగా తాగునీరందించేలా కృషి చేస్తాం. ఎక్కడెక్కడ లీకేజీలు ఉన్నాయో గుర్తించి అత్యవసర నిధుల ద్వారా మరమ్మతులు చేయించేలా చర్యలు చేపడతాం. ఎస్ఎస్‌ట్యాంకులో ఆరు నెలలకు సరిపడునన్ని నీరు అందుబాటులో ఉన్నాయి. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా చూస్తాం. శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం అధికారుల దృష్టికి తీసుకెళ్లి పట్టణంలో లీకేజీలు అరికట్టిస్తాం

– దివాకర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, రాయదుర్గం

పంచాయతీకి రూ.42 లక్షల ఆదాయం

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ పంచాయతీ సీల్డ్ టెండర్లను అధికారులు, పోలీసుల సమక్షంలో బుధవారం తెరిచారు. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకూ దినసరి మార్కెట్, బస్టాండ్, కసాయి అంగళ్లు, గొర్రెలు, మేకల మార్కెట్, సులభ్ కాంప్లెక్స్ హక్కులతో పాటు ప్రజారోగ్య సామగ్రి సరఫరా కోసం టెండర్లు నిర్వహించారు. బుధవారం సీల్డ్ టెండర్లను సర్పంచ్ మీనుగ లలితమ్మ, ఈఓఆర్డీ సతీష్, ఈఓ గౌస్‌సాహెబ్ ఆధ్వర్యంలో తెరిచారు. ఇందులో దినసరి మార్కెట్‌ను ఎం.నగేష్ రూ.14,69,000, బస్టాండ్‌ను గోవిందు రూ.7,36,000 కసాయి అంగళ్లను గోపాల్ రూ.7,76,800 మేకల గొర్రెల మార్కెట్‌ను ఓబులేసు రూ.8,03,500 పాయిఖానాను పెన్నయ్య రూ.3,35,000లకు దక్కించుకున్నారు. సీల్డ్ టెండరుకు అదనంగా 3 శాతం స్టాంప్ డ్యూటీతో కలుపుకుని పంచాయతీకి రూ.42,43,909 ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

ప్రొటోకాల్ పాటించండి

- వార్డుల్లో పార్టీ ఇన్‌చార్జ్‌ల పెత్తనమేంటి?
- అధికారులకు చురకలంటించిన కౌన్సిలర్లు
- బందోబస్తు నడుమ మున్సిపల్ మీట్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: ప్రొటోకాల్‌ను పక్కనపెట్టి వార్డుల్లో టీడీపీ ఇన్‌చార్జ్‌లకు పెద్దపీట వేస్తూ, కౌన్సిలర్లకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని 19, 28 వార్డుల కౌన్సిలర్లు పొరాళ్ల గోవిందరాజులు, శారదాదేవి అధికారులపై మండిపడ్డారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గత సమావేశం సందర్భంగా కౌన్సిలర్ల మధ్య జరిగిన గొడవలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా స్పెషల్‌పార్టీ పోలీలసుల బందోబస్తు మధ్య ఈసారి సమావేశం నిర్వహించారు. తొలుత 27 అంశాలతో కూడిన అజెండాను మున్సిపల్ సిబ్బంది చదివి వినిపించారు. అజెండాలోని 1, 2 అంశాలకు సంబంధించి కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు మాట్లాడుతూ సాధారణ నిధుల ద్వారా కాకుండా ప్రత్యేక నిధులతో సదరు అంశాలను పొందుపరచాలని డిమాండ్ చేయడంతో.. వాటిని రద్దు చేసి మిగతా అంశాలను ఏకగ్రీవంగా కౌన్సిల్ ఆమోదించింది. అనంతరం మరో 14 అంశాలతో కూడిన అత్యవసర అజెండాను కౌన్సిల్ దృష్టికి తేవడంతో ఎటువంటి అభ్యంతరాలు రాకపోవడంతో ఆమోదించారు. జీరో అవర్స్‌లో పలువురు కౌన్సిలర్లు సమస్యలను ఏకరవు పెట్టారు. 28వ వార్డు కౌన్సిలర్ గోవిందరాజులు మాట్లాడుతూ ఇటీవల జరిగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి కౌన్సిలర్లకు సమాచారం ఎందుకు తెలపలేదని నిలదీశారు. ఎవరెవరో వార్డు ఇన్‌చార్జులంటూ హడావుడి చేశారని, తమపట్ల అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించడం తగదన్నారు. పట్టణంలో దోమల బెడద తీవ్రంగా ఉందని, ఫాగింగ్ యంత్రాలు రిపేరీకి నోచుకోక మూలన పడేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. 19వ వార్డు కౌన్సిలర్ శారదాదేవి మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ ప్రకారం నడుచుకోవాలని చురకలంటించారు. అనధికారికంగా వార్డు ఇన్‌చార్జ్‌లకు పెత్తనం కట్టబెట్టడం సరికాదని, ఇకనైనా పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. కౌన్సిలర్ లక్ష్మి మాట్లాడుతూ గ్యాస్ గోడౌన్ వద్ద డ్రెయినేజీల్లో పూడిక తీయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తాగునీటి సరఫరా సక్రమంగా లేదని, వారానికో మారు వదులుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సమావేశం దృష్టికి తెచ్చారు. ఎస్ఎస్ ట్యాంకులో నీరు సమృద్ధిగా ఉన్నా జాప్యం జరుగుతుండడం శోచనీయమన్నారు.


తాగునీటి కొరత రానీయొద్దు

వేసవి దృష్ట్యా పట్టణంలో తాగునీటి కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ శిల్ప పేర్కొన్నారు. ఇది వరకే ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమావేశమై నీటి కొరత రాకుండా చూసుకోవాలని సూచించినట్లు చెప్పారు. స్టాండ్‌బై మోటార్లను అందుబాటులో ఉంచుకోవాలని, అవసరమైన చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, సీఐ జయానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఔరా... వానరా..!

భానుడు ప్రతాపం చూపుతున్నాడు. ఎండల వేడిమికి మూగజీవాలు అల్లాడిపోతున్నాయి. దాహం తీర్చుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాయి. బుధవారం కూడేరు బస్టాండ్‌లో ఓ వానరం దప్పిక తీర్చుకునేందుకు చేసిన సాహసం ఆకట్టుకుంది. తొలుత వానరానికి దాహం వేయడంతో నీటి కోసం చుట్టుపక్కల వెతికింది. నీరు లభించక పోవడంతో వీరప్ప కొబ్బరి బోండాల అంగట్లో ఓ కొబ్బరి బొండాన్ని ఎత్తుకెళ్లింది. పక్కనే ఉన్న పవన్ మొబైల్ షాపు వద్దకు వెళ్లి.. నీరొస్తుందేమో అని బోండాన్ని అల్లాడించింది. నీరు బయటకు రాకపోవడంతో ఎలాగైనా దప్పిక తీర్చుకోవాలని నిశ్చయించుకుంది. పది నిమిషాల పాటు కొబ్బరి బోండాం పీచును నోటితో తొలగించింది. మరో వానరం వచ్చి బోండాన్ని లాక్కునేందుకు ప్రయత్నించగా.. బాషా చెప్పుల షాపు వద్దకు పరుగులు పెట్టింది. అనంతరం కొబ్బరి బోండాన్ని మెట్లకు కొట్టగా నీరు బయటకు రావడంతో దప్పిక తీర్చుకుంది. అందులో ఉన్న కొబ్బరిని కూడా శుభ్రంగా తిని హాయిగా అటు నుంచి జారుకుంది. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– కూడేరు:



కొబ్బరి బోండం పీచు తొలగిస్తున్న వానరం



కొబ్బరి తింటున్న దృశ్యం



కొబ్బరి బోండంను పగలగొట్టి నీరు తాగుతూ..

'పోషణ్ బీ-పఢై బీ'పై శిక్షణ ప్రారంభం



శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

రాయదుర్గంటౌన్: అంగన్‌వాడీ వర్కర్లకు 'పోషణ్ బీ- పఢై బీ' అంశంపై మూడు రోజుల శిక్షణను బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మండలంలోని 74 ఉడేగోళం జడ్పీ హైస్కూల్‌లో జరిగిన శిక్షణకు రాయదుర్గం ప్రాజెక్ట్ పరిధిలోని 128 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు హాజరయ్యారు. సీడీపీఓ పద్మావతి కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. బాల్యారంభ దశలో నాణ్యమైన విద్యను అందించడం కోసం అంగన్‌వాడీ కార్యకర్తల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు శిక్షణ తరగతులు దోహదపడుతాయన్నారు. ఈ నెల 28 వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణలో ముఖ్యంగా ఆధార్‌శిల, నవచేతన అనే రెండు విధాలుగా శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆధార్‌శిలలో 3 నుంచి 6 సంవత్సరాల పిల్లలకు వారిలో ఉండే 5 రకాల అభివృద్ధులను వివరించనున్నట్లు తెలిపారు. ఈ అభివృద్ధులను అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఆటపాటల ద్వారా అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఈశ్వరమ్మ, అంజినమ్మ, జ్యోతిలక్ష్మి, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి

గుమ్మఘట్ట : ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి అన్నారు. మండలంలోని గోనబావి గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ఒత్తిళ్లు గురిచేసినా భయపడరాదన్నారు. తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు గాలికి వదిలేసిందని మండిపడ్డారు. గ్రామాల్లో బెల్టుషాపులు పెట్టించి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతోందన్నారు. ఎరువుల ధరలు, నిత్యావసర ధరల నియంత్రణలో ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గొని లక్ష్మీ కాంతరెడ్డి, సర్పంచులు రాజేష్, రమేష్, అనిల్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, పట్టణ, రాయదుర్గం మండల అధ్యక్షులు మేకల శ్రీనివాసులు, రామాంజినేయులు, నాయకులు ప్రతాప్‌రెడ్డి, కురుబ రామాంజినేయులు, ఈశ్వర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, అనంతరెడ్డి, గంధవీడి తిప్పేస్వామి, సిద్ధప్ప, కె.ఎం.రాజు, శీనా, రుద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైస్ ఎంపీపీ-2 స్థానానికి ఎన్నికలు



ఉరవకొండ ఎంపీడీఓకు విప్ పత్రాలను అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: నేడు ఉరవకొండ మండల ప్రజాపరిషత్ వైస్ ఎంపీపీ-2 ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉరవకొండ మండలంలో మొత్తం 23 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. ఇద్దరు టీడీపీ ఎంపీటీసీలు, ఒకరు సీపీఐ పార్టీకి చెందిన వారు ఉన్నారు. మిగతా 20 మంది ఎంపీటీసీలు వైఎస్సార్‌సీపీకి చెందిన వారు ఉన్నారు. 20 మందిలో తాజాగా ఉరవకొండకు చెందిన పెద్దక్క అనే ఎంపీటీసీ మృతి చెందారు. దీంతో వైఎస్సార్‌సీపీకి 19 మంది ఎంపీటీల బలం ఉంది. వైస్ ఎంపీపీ ఎన్నిక ఏకపక్షంగా జరగనుంది. బుధవారం ఉరవకొండ ఎంపీపీ నరసింహులు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నేతలు సీపీ వీరన్న, ఏసీ ఎర్రిస్వామి, పార్టీ అభ్యర్థి ఈడిగ ప్రసాద్, రూరల్ కన్వీనర్ ఎర్రిస్వామిరెడ్డి, ఎంపీటీసీలు కురుబ ప్రకాష్, మల్లి తదితరులు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి అందిన విప్ పత్రాలను ఎంపీడీఓ రవిప్రసాద్‌కు అందజేశారు. ఎన్నికల నియమావళిపై ఎంపీడీఓతో చర్చించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం సంతకాలు చేయలేదు



కమిషనర్‌కు లేఖలు అందజేస్తున్న కౌన్సిలర్లు

రాయదుర్గంటౌన్: మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం అంటూ తాము సంతకాలు చేయలేదని, అలా ఎవరైనా ఇస్తే తిరస్కరించాలని 7, 10, 13, 27, 31 వార్డుల కౌన్సిలర్లు శివపుత్ర, ఏటూరి అనిత, ప్రతాప్, లుబ్నా గజాల, తాడూరు భాగ్య స్పష్టం చేశారు. ఈ మేరకు వారు వ్యక్తిగతంగా బుధవారం కమిషనర్ దివాకర్‌రెడ్డికి లేఖలు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కొందరు కౌన్సిల్ సభ్యులు కొన్ని రోజుల క్రితం వచ్చి పట్టణాభివృద్ధి కోసమని పేపర్లపై సంతకాలు తీసుకున్నట్లు చెప్పారు. తర్వాత తాము విచారిస్తే ప్రస్తుత చైర్‌పర్సన్ శిల్పపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అలా సంతకం చేయించుకున్నట్లు తెలిసిందన్నారు. తాము అవిశ్వాస తీర్మానం కోసం ఎటువంటి సంతకాలూ చేయలేదన్నారు. తాము చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం కోసం అంటూ ఎవరైనా మా సంతకాలతో కూడిన పేపర్లు మీకు ఇస్తే స్వీకరించరాదని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. చైర్‌పర్సన్ నిజాయతీగా పనిచేస్తున్నారని, ఆమెపై మాకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. ఈ మేరకు సదరు లేఖలను కమిషనర్‌తో పాటు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, కలెక్టర్, ఆర్డీఓలకు పంపుతున్నట్లు చెప్పారు.

నేడు మాజీ ఎంపీ పర్యటన

శెట్టూరు: లక్ష్మంపల్లి గ్రామంలో గురువారం మాజీ ఎంపీ తలారి రంగయ్య పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎంఎస్ రాయుడు, మాజీ కన్వీనర్ సోమనాథరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ మాజీ కోఆప్షన్ మెంబర్ ఇమామ్ వలి ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులో పాల్గొంటారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.


ఉచిత గుండె వైద్య శిబిరం

ఉరవకొండ: స్థానిక గవిమఠం ప్రాంగణంలో బుధవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి వారి సౌజన్యంతో దాదాపు 100 మందికి ఉచితంగా 2డీఎకో, షుగర్, బీపీ, జీఆర్‌బీఎస్ తదితర వైద్య పరీక్షలు చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ వర్ధంతిని పురస్కరించుకుని ఈశిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌వి జనార్దన్‌నాయుడు, ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు కొత్రేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించండి

కళ్యాణదుర్గం: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ ప్రజలను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల 301లోపు ఆస్తి, తాగునీటి పన్ను బకాయిలు ఒకేసారి చెల్లించిన వారికి వడ్డీపై 50 శాతం రాయితీ వర్తిస్తుందని పేర్కొన్నారు. సెలవు రోజుల్లో కూడా పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని తెలిపారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

విద్యార్థుల జీవితాలతో చెలగాటం



మహాసభల లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం చేతకాని పాలనతో రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులు రోడ్డున పడ్డారు. మంత్రి లోకేష్ విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించేలా నిర్ణయాలు తీసుకుంటూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల లోగోను ఏఐవైఎఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సంతోష్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మే 15 నుంచి 18 వరకూ తిరుపతిలో జాతీయ మహాసభలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కొత్రేష్, రాష్ట్ర సమితి సభ్యులు మురళి, నాగయ్య, నవీన్‌బాబు, వేను, పండు, సంతోష్ పాల్గొన్నారు.

పశు బీమా చేయించుకోండి

కూడేరు: పశువులకు ఈనెల 30లోపు బీమా చేయించుకోవాలని మండల పశు వైద్యాధికారి శ్రీనివాసులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీమా ఒక్కసారి చెల్లిస్తే మూడేళ్ల వరకూ వర్తిస్తుందన్నారు.

29న మండల సమావేశం

కూడేరు: స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఇన్‌చార్జ్ బాలాజీ, సీఈఓ రామాంజనేయులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.

రుణాలు రెన్యూవల్ చేసుకోండి

కూడేరు: క్రాప్ లోన్ తీసుకున్న రైతులు ఏడాదిలోపు రెన్యూవల్ చేయించుకుంటేనే ప్రభుత్వం వర్తింపజేసే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ లబ్ధి పొందడానికి వీలుంటుందని ఏపీజీబీ మేనేజర్ రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన క్రాప్ లోన్ల రెన్యూవల్ షెడ్యూల్‌ను వెల్లడించారు.

ఐదుగురు గైర్హాజరు

కూడేరు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా బుధవారం ఫిజికల్ సైన్స్ పరీక్ష జరిగింది. మొత్తం 306 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా.. ఐదుగురు గైర్హాజరైనట్లు మండల విద్యాధికారి మహమ్మద్ గౌస్ తెలిపారు. కేజీబీవీలోని పరీక్ష కేంద్రాన్ని ఎంఈఓ-2 సాయికృష్ణ పర్యవేక్షించారు.

వైస్ చైర్మన్‌కు ప్రత్యేక గది తగదు

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం కార్యాలయంలో వైస్ చైర్మన్‌కు ప్రత్యేక గది ఏర్పాటు తగదని పలువురు కౌన్సిలర్లు కమిషనర్ దివాకర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు 15 మందికిపైగా కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు బుధవారం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వైస్ చైర్మన్‌కు కేటాయించిన గదిని ఖాళీ చేయించాలని కౌన్సిలర్లు గొని లావణ్య, అనిత, శారదాదేవి, శ్రీలక్ష్మీ, భాగ్య, సాబిరాబీ, లుబ్నా గజాల, నసీమా, రేఖ, సంజీవప్ప, కోఆప్షన్ సభ్యులు శ్రీనివాసులు, నజీర్, బ్యూలా విజ్ఞప్తి చేశారు.

మహిళలపై వివక్ష చూపకూడదు

వజ్రకరూరు: మహిళలపై వివక్ష చూపకూడదని సర్పంచ్ మల్లెల జగదీష్ అన్నారు. బుధవారం మండలంలోని చాబాల గ్రామంలో లింగ వివక్ష నిర్మూలనపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రస్తుత ప్రపంచంలో స్త్రీ, పురుషులు సమానమే అన్నారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వేణుగోపాల్, ఎంపీహెచ్ఈఓ విజయ్ కుమార్, సీహెచ్ఓ పావని కుమారి, ఏఎన్ఎం ఇందిరమ్మ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

శానిటరీ ప్యాడ్ కేంద్రం పరిశీలన

కుందుర్పి: స్థానిక కుసుమగిరి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ వారి సౌజన్యంతో కుందుర్పిలో నిర్వహిస్తున్న శానిటరీ ప్యాడ్ కేంద్రాన్ని బుధవారం కెనరా బ్యాంక్ చీఫ్ మేనేజర్ జయప్రకాష్, బ్రాంచ్ మేనేజర్ సాయితేజ పరిశీలించారు. శానిటరీ ప్యాడ్ తయారీకి సంబంధించి విషయాలను సిబ్బందితో అడిగి తెలుసుకున్నారు.